క్లుప్తంగా

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

లక్ష్మణచాంద: కోరం లేకపోవడంతో మంగళవారం నిర్వహించిన లక్ష్మణచాంద మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో శేఖర్ తెలిపారు. సరిపడా ఎంపీటీసీ సభ్యులు రాకపోవడంతో వాయిదా వేశామని.. త్వరలో సమావేశం నిర్వహించే తేదీని వెల్లడిస్తామని పేర్కొన్నారు.

న్యాయం చేయాలని వినతి



ఎమ్మెల్యే బొజ్జుకు విన్నవిస్తున్న కార్మికులు

కడెం: గత ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని కడెం, దస్తురాబాద్ మండలాల విద్యుత్ ఆన్‌స్కిల్డ్ కార్మికులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కోరారు. మంగళవారం జన్నారం మండలంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ప్రాణాలను పణంగా పెట్టి ఏళ్లుగా చాకిరీ చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కార్మికులు తెలిపారు. సురేందర్, గంగన్న, మహేశ్, నజీర్, జగన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ఖానాపూర్: వ్యవసాయ బావుల విద్యుత్ కనెక్షన్ సర్వీస్ చార్జీలను రైతులు సకాలంలో చెల్లించాలని ఖానాపూర్ ఏడీఈ కౌట్ల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఖానాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, మామడ మండలాల్లోని రైతులు సర్వీస్ చార్జీలను ఆయా గ్రామాల్లో వసూలుకు వచ్చే సిబ్బందికి వెంటనే చెల్లించి సంస్థ బలోపేతానికి సహకరించాలని కోరారు.

బెంచీల విరాళం



బెంచీల్లో కూర్చొన్న విద్యార్థులు

భైంసా: బాసర మండలంలోని కిర్గుల్(బి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.18వేల విలువైన బెంచీలను అదే గ్రామానికి చెందిన గోదాదేవి విరాళంగా అందించారు. విద్యార్థుల సౌకర్యార్థం బెంచీలను అందించినట్లు వారు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు నర్సింగ్‌రావు, ఉపాధ్యాయురాలు రమాదేవి, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభాకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ సాయిలు పాల్గొన్నారు.

నిల్వనీటితో దోమల వ్యాప్తి

లక్ష్మణచాంద: పరిసరాల్లో నిలిచిన నీటితో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పార్‌పెల్లి ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో పార్‌పెల్లి, పార్‌పెల్లితండా, పొట్టపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇళ్ల వద్ద నిల్వనీటిని పారబోయించారు. పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు.

ముధోల్ ఎమ్మెల్యే పరామర్శ

ముధోల్: మండల కేంద్రంలో రిటైర్డ్ సీడీపీవో పుష్పతాయి కుమారుడు సచిన్ అనారోగ్యంతో కరుణాకర్ల శంకర్ గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబసభ్యులను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పరామర్శించారు. రమేశ్, పోతన్న, శ్రీనివాస్, దశరథ్, సంతోష్‌పటేల్, మదన్, గంగాధర్ తదితరులున్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



అక్షింతలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో మంగళవారం అయోధ్య అక్షింతలతో హనుమాన్ భక్తులు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం హనుమాన్ మందిరంలో పూజలు చేశారు. అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తామని భక్తులు తెలిపారు. వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, శ్రీనివాస్, నర్సయ్య, భక్తులు నవీన్, సాయన్న, భూమన్న, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

'ఆర్‌ఎంపీలను గుర్తించాలి'

భైంసాటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలను ప్రభుత్వం గుర్తించాలని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు మోహన్ కోరారు. మంగళవారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాన్ని కొనసాగిస్తూ ఆర్‌ఎంపీలకు గుర్తింపు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం హర్షనీయమన్నారు. డివిజన్ కార్యదర్శి అమ్ముల సాగర్, భైంసా మండల కార్యదర్శి కదం అర్జున్‌పటేల్, కుభీర్ ప్రతినిధులు పోశెట్టి, మాణిక్ దగడే, తదితరులు పాల్గొన్నారు.

వామ్మో వానరం..

- ఇళ్లలోకి వచ్చి దాడులు చేస్తున్న కోతులు
- రోజురోజుకి తీవ్రమవుతున్న బెడద
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు
- భయాందోళనలో భైంసా పట్టణవాసులు



భైంసాలోని పులేనగర్‌లో ఓ ఇంటిపై చేరిన కోతులు

భైంసాటౌన్: గుంపులుగుంపులుగా వస్తున్న వానరమూకను చూస్తే.. ఎంతటివారికైనా భయాందోళన తప్పదు. భైంసాలో కోతులు జనవాసాల్లోకి వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇళ్లలోకి వచ్చిన కోతులను బెదిరించేందుకు యత్నిస్తే మీద పడి కరుస్తున్నాయి. పట్టణంలోని పురాణబజార్‌లో ఓ మహిళను వానరం వెంబడించడంతో ఆమె జారి కిందపడింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. భయాందోళనకు గురైన సదరు మహిళ గుండెపోటుకు గురై ఆస్పత్రి పాలైంది. అనంతరం ఆపరేషన్ తర్వాత ఆమె కోలుకుంది.

– మరో సందర్భంలో పద్మావతి కాలనీలో ఓ మహిళ ఇంటిపై బట్టలు ఆరేస్తున్న క్రమంలో కోతి దాడికి యత్నించింది. దీంతో భయాందోళన చెందిన సదరు మహిళ తప్పించుకునే క్రమంలో మెట్లపై నుంచి జారిపడి గాయాలపాలైంది. ఇలా జనావాసాల్లోకి వస్తున్న కోతులతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి వస్తున్న కోతులు ఇళ్లలోని ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. మహిళలు బట్టలు ఆరేస్తున్న క్రమంలో, ఇంటిపనులు చేస్తున్న సందర్భాల్లో వాటికి భయపడి పరుగులు తీస్తున్నారు. కోతుల బెడదకు రోజంతా తలుపులు మూసే ఉంచుతున్నారు. గుంపులుగుంపులుగా వస్తున్న కోతులు కొద్ది సమయం వరకు కదలకపోవడంతో అవి వెళ్లాకగానీ బయటకు వచ్చే పరిస్థితి ఉండడం లేదు.

అటవీశాఖ చర్యలేవీ...

అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఆహార అన్వేషణ కోసం ఇళ్లలోకి వస్తుండడంతో మహిళలు, చిన్నపిల్లలు భయపడుతున్నారు. పట్టణంలోని వినాయక్‌నగర్, పులేనగర్, రాంనగర్, కిసాన్‌గల్లి, పురాణబజార్, బట్టిగల్లి, తదితర ప్రాంతాల్లో కోతుల సంచారం ఎక్కువగా ఉంటోంది.

ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయాలి..

అటవీప్రాంతాల్లో కోతులకు ఆహారం అందించే ఏర్పాట్లు లేక జనావాసాల్లోకి చేరుతున్నాయి. వాటికి ఆహారం కోసం ప్రత్యేకంగా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తే జనావాసాల్లోకి వచ్చే బెడద తప్పుతుంది. ఈ దిశగా అటవీ అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు వేడుకుంటున్నారు.

తనిఖీ చేస్తూ.. సిబ్బందికి సూచనలిస్తూ

- గ్రామాల్లో పర్యటించిన మండల ప్రత్యేకాధికారులు

తానూరు: రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి ఆష్ఫాక్ హైమద్ సూచించారు. మంగళవారం మండలంలోని ఝరి(బి) గ్రామంలో పర్యటించి వీధులను పరిశీలించారు. హోటళ్లలో తడి, పొడి చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవాలని యాజమానులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం వెళ్లి సూచనలు చేశారు. ప్రకృతివనం, నాటిన మొక్కలను ఎండిపోకుండా చూడాలని ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్, ఏపీవో గంగాధర్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి

లోకేశ్వరం: చిన్నారులకు, గర్భిణులకు పోషకాహారం అందించాలని అందించాలని నిర్మల్ డీడబ్ల్యూవో, మండల ప్రత్యేకాధికారి రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, కేజీబీవీ పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. అంగన్‌వాడీలో చిన్నారులకు బొమ్మల సాయంతో పాఠాలు చెప్పాలని టీచర్లకు సూచించారు. కేజీబీవీలో మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాధిక, సిబ్బంది ఉన్నారు. లోకేశ్వరంలోని ప్రకృతివనం, రోడ్డు పక్కల నాటిన మొక్కలను మండల ప్రత్యేకాధికారి రమేశ్ పరిశీలించారు. కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏలు మంజుల, శారద, రవీందర్ ఉన్నారు.



తానూరు: ఝరి(బి) అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారి హైమద్

సారంగపూర్: మండలంలోని ఆలూరు గ్రామంలో మంగళవారం మండల ప్రత్యేకాధికారి గంగాధరయ్య పర్యటించారు. ఈసందర్భంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లి నిర్వాహకులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పల్లె ప్రకృతివనం, క్రీడామైదానం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లలకు కోడిగుడ్లు, పాలు, భోజనం అందిస్తున్న విధానాలపై ఆరా తీశారు. నర్సరీ పరిశీలించి బ్యాగ్‌ఫిల్లింగ్ పూర్తి చేయించి విత్తనాలు నాటాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ సరోజ, ఏపీఓ లక్ష్మారెడ్డి, కార్యదర్శి లింగయ్య,టీఏ, ఎఫ్‌ఏలు ఉన్నారు.

డీఎల్‌పీవో పర్యటన

భైంసారూరల్: మండలంలోని చింతల్‌బోరి ప్రాథమికోన్నత పాఠశాలను డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి సందర్శించారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కృష్ణ, రత్న, హరీశ్ తదితరులు ఉన్నారు.



ఆలూరులో వివరాలు తెలుసుకుంటున్న అధికారి



సోన్: సాకెరలో పాఠశాల వద్ద అధికారి శంకర్

సోన్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ శంకర్, ఎంపీడీఓ గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాకెర గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని, నర్సరీ, సంపద వనాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీఓ ఖలీల్ హైమద్, ఏపీవో మంజులారెడ్డి, ఏపీఓ గంగామణి, కార్యదర్శి ప్రియాంక రెడ్డి, ఉపాధ్యాయులు లింగన్న తదితరులున్నారు.

అడిగిన వారికి ఉపాధి కల్పించాలి

లక్ష్మణచాంద: జాబ్‌కార్డు కలిగి పని అడిగిన కూలీలకు తప్పనిసరిగా ఉపాధి కల్పించాలని ఎంపీడీవో శేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాచాపూర్, పొట్టపెల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నర్సరీలను పరిశీలించి నర్సరీ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు శ్రీనివాస్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. కూలీలు చేస్తున్న నీటి నిల్వ కుంటల నిర్మాణ పనుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



పొట్టపెల్లిలో కూలీలతో ఎంపీడీవో శేఖర్

'వ్యవసాయానికి అనుసంధానం చేయొద్దు'

నిర్మల్‌చైన్‌గేట్: వ్యవసాయరంగానికి ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయకూడదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఉపాధిహామీ కూలీల కూలి రూ.300లకు పెంచుతామని, ఏడాదికి 150 రోజులు పని కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పనులు అనుసంధానం చేస్తే అది భూస్వాములు, పెత్తందారులకు ఉపయోగపడేది మాత్రమే అవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అణగారిన కులాలకు చెందిన వారి భూములలో ఉపాధి హామీ చట్టం నిర్ణయించిన ప్రకారం పనులు కల్పించడానికి గుర్తించిన పనులు చేయించాలన్నారు. కూలీలందరికీ జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. కూలీల నుంచి నెలకు రూ.100 వసూలు చేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని కోరారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు బర్కుంట గంగరాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తిరుపతి

విద్యుత్ లైన్లు పరిశీలన

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో విద్యుత్ లైన్లను ఏఈఈ సుమన్‌కుమార్ పరిశీలించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్ ఏఈఈని కోరగా.. త్వరలో మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. ఇందులో కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు వెంకటేశ్, రాజన్న, శ్రీను, భూషణం, తిరుపతి, రవి తదితరులున్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని కన్నపూర్ ప్రభుత్వ పాఠశాలలో అదే గ్రామానికి చెందిన ఇర్ల అనిత–గణేశ్ దంపతులు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. వారి కుమారుడు మణికంఠ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నోట్‌బుక్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవీందర్, అంగన్‌వాడీ టీచర్ ప్రభ ఉన్నారు.

'ఆటోడ్రైవర్లకు రూ.3వేలు సాయంగా ఇవ్వాలి'

నిర్మల్‌చైన్‌గేట్: ఆటోడ్రైవర్లకు నెలకు రూ.మూడు వేలను ప్రభుత్వం సాయంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డీఆర్వో లోకేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండటంతో ఆటోడ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. ధనవంతులు, ప్రభుత్వ ఉద్యోగులకు ఈ పథకం వర్తింపజేయడం వలన ఆర్టీసీ నష్టాల్లోకి వెళ్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, కల్లూర్ సుధాకర్, కాసారం రాజు, రాజన్న పాల్గొన్నారు.

నారుమడిలో జాగ్రత్తలు తీసుకోవాలి

సోన్: చలి పెరుగుతున్న నేపథ్యంలో నారుమడిలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో అంబాజీ అన్నారు. మంగళవారం మండలంలోని కూచన్‌పెల్లి గ్రామంలో రైతులకు నారుమడిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి సమస్యను అధిగమించేందుకు నారుమళ్లపై పాలిథీన్ షీట్ లేదా సంచుల పరుద సాయంత్రం కప్పి ఉదయం తీసివేయాలని సూచించారు. రైతులు మహేందర్, గంగాధర్ పాల్గొన్నారు.


ఘనంగా ధన్వంతరి జయంతి

భైంసారూరల్: మండలంలోని ఖథ్‌గాం గ్రామంలో మంగళవారం ఆరోగ్యదేవత భగవాన్ శ్రీధన్వంతరి జయంతి నిర్వహించారు. దీనికి ఆరోగ్య భారతి రాష్ట్ర నాయకులు డా.ముష్కం రామకృష్ణాగౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంట్లో ఔషధ మొక్కలను పెంచుకుని గృహ వైద్యం, ప్రథమ చికిత్స చేయడం తెలుసుకోవాలని సూచించారు. అనంతరం స్రీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. సర్పంచ్ రాజు, కార్యదర్శి ప్రదీప్, రాము, గురుకృప వొకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ తదితరులున్నారు.

వ్యాధులపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని భర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికేబుల్ డీజీజెస్)పై వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యురాలు శ్రీవిద్య బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అంతకముందు 30 ఏళ్ల పైబడిన వారికి స్క్రీనింగ్ చేసి బీపీ, షుగర్ టెస్ట్‌లు నిర్వహించారు. ఏఎన్‌ఎం పద్మ, టీచర్ వరలక్ష్మి, ఆశవర్కర్లు తదితరులున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న పండితులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీమహాలక్ష్మి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం పండితులు పిసుపాటి రేవంత్, గౌతమ్, విష్ణుభట్ల రాజశేఖర్‌శర్మ, సంతోష్, నందు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, మహాలక్ష్మి మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గంటలోనే ముగించేశారు..

- సాదాసీదాగా లోకేశ్వరం మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత

లోకేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బయామోల్ల లలిత అధ్యక్షతన నిర్వహించిన లోకేశ్వరం మండల సర్వసభ్య సమావేశం గంటలోనే ముగించేశారు. మండలంలో మొత్తం 10 మంది ఎంపీటీసీలకుగాను బిలోలి ఎంపీటీసీ విజయ, పిప్రి ఎంపీటీసీ రాణి, రాజూర ఎంపీటీసీ నర్సవ్వ, కోప్షన్ సభ్యులు ప్రకాశ్ వీరితో పాటు ఐదుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, పాలకులు సమన్వయంతో ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈసందర్భంగా పలువురు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

- మండలంలోని పుస్పూర్ పాఠశాలలో మరుగుదొడ్డి కోసం విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ నర్సన్న సభ దృష్టికి తీసుకొచ్చారు. పనులను ఉపాధిహామీ పథకం కింద చేపట్టాలని ఎంఈవో చంద్రకాంత్ తెలిపారు.
- కొత్త పంచాయతీలకు రేషన్ డీలర్లను నియమించడంతోపాటు అనుబంధ గ్రామాల్లోనూ రేషన్ బియ్యం పంపిణీ చేయాలని మండల కోఆప్షన్ సభ్యుడు కల్యాణ్ ప్రకాశ్ కోరారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ మోతీరాం వివరించారు.
- మండలంలో ఇటీవల 10మందికి రైతుబీమా చెక్కులు అందజేశామని ఏఈవో భూమేశ్ పేర్కొన్నారు. ఆయిల్‌పాం సాగుకు ముందుకొచ్చి ప్రభుత్వం ఇచ్చే రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఎంపీటీసీలు కోరగా.. సమస్య పరిష్కరిస్తామని ఏఈ శివకుమార్ తెలిపారు. రాజూరలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను వేగవంతం చేస్తామన్నారు.

సాథ్‌గాం సమీపంలోని రోడ్డు ఏటా వర్షాకాలంలో కొట్టుకుపోతుందని సభ్యులు తెలుపగా అక్కడ సీసీరోడ్డు నిర్మించేందుకు ఉన్నతాధికారులకు నివేదించామని పీఆర్ ఏఈ రఘువంశీ తెలిపారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఏఈలు శివకుమార్, రఘువంశీ, ఏఈవో భూమేశ్, ఏపీవో మల్లేశ్, ఏపీఎం జగన్నాథ్, పశువైద్యాధికారి జెస్సీ తదితరులు ఉన్నారు.

బాధితుడికి మిత్రుల అండ

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన సింహరాజుల ఆనంద్ అనారోగ్యంతో మంచానికే పరిమితమై ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. అతడితో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991–92లో పదో తరగతి చదువుకున్న మిత్రులు ఆనంద్ పరిస్థితి తెలుసుకొని రూ.40 వేలను మంగళవారం ఇంటికి వెళ్లి అందించారు. సింగాపూర్‌లో ఉండే పన్నెల జనార్దన్, అమెరికాలో ఉండే శ్రీకాంత్‌స్వామి, విశ్వేశ్వర్ రూ.20 వేలు పంపించారు. ఇక్కడే ఉండే పలువురు మరో రూ.20వేలు సమకూర్చారు. కార్యక్రమంలో కామోజి వేణు, పడిగెల శ్రీదర్, పెద్దమల్లేశ్, మధుకర్‌రెడ్డి, కావలి సంతోశ్, సీహెచ్.సతీశ్, చలం తదితరులున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

ఆకతాయిలు వేధిస్తే ఫిర్యాదు చేయండి

కుంటాల: ఆకతాయిలు వేధిస్తే భయపడకుండా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీటీం ఇన్‌చార్జి ఎస్సై పోగుల సుమాంజలి అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఫోన్‌కు దూరం ఉండి చదువుపై దృష్టి సారించాలన్నారు. క్రమశిక్షణతో చదివితే ఫలితాలు వాటంతటఅవే వస్తాయని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు బోయి సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, సుధాకర్, డైరెక్టర్లు కడార్ల హరిప్రసాద్, జానకీరాం, సిబ్బంది మంజుల, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల ఎంపికకు గ్రామసభలు

సారంగపూర్: మండలంలోని ఆలూరు, ప్యారమూర్. పొట్య గ్రామాల్లో మంగళవారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనుల వార్షిక బడ్జెట్ రూపకల్పన, పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఇన్‌చార్జి ఎంపీపీ పతాని రాధ మాట్లాడారు. లేబర్ బడ్జెట్ ఆమోదంతోపాటు వ్యవసాయ రంగానికి ఉపయోగపడే పనులను ఎంపిక చేసుకుంటే కూలీలు, రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. సర్పంచ్ దండు రాధ, మండల ప్రత్యేకాధికారి గంగాధరయ్య, ఎంపీడీఓ సరోజ, ఏపీఓ లక్ష్మారెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నంబర్‌ప్లేట్ విరగ్గొడితే కేసు

నిర్మల్‌టౌన్: వాహనదారులు నంబర్‌ప్లేట్ విరగొట్టినా, తొలగించినా కేసులు నమోదు చేస్తామని నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పట్టణ సీఐ పురుషోత్తం ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని 55 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవ్‌లో ఏపీ25ఏ8600 అనే బైక్ నంబర్‌పై అనుమానం రాగా స్టేషన్‌కు తీసుకెళ్లి చాసిస్ పోల్చిచూశారు. ఆ బైక్ ఒరిజినల్ నంబర్ ఏపీ25ఏఎన్ 3386గా తేలింది. దీంతో బైక్ యజమాని(నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన భోజన్న)కి సమాచారం ఇవ్వడంతో ఆయన ధ్రువపత్రాలతో వచ్చి బైక్‌ను తీసుకెళ్లాడు. మైనర్లకు వాహనాలు ఇస్తే యాజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సైలు హెచ్చరించారు. కంపెనీ సైలెన్సర్లు కాకుండా, మార్కెట్లో దొరికే సైలెన్సర్లను బిగిస్తే వాహనాలు సీజ్ చేస్తామని పేర్కొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు

కనుల పండువగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్పకు పూజలు చేస్తున్న గురుస్వాములు

భైంసారూరల్: కుభీర్‌లోని విఠలేశ్వరస్వామి మందిరంలో మంగళవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. మేఘరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప, వినాయక, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గురుస్వాములు పెంటాజీ, అనిల్, ధర్మారాజ్, నర్సప్ప, వివేకానంద,స్వాములు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని జేకేనగర్ కాలనీలో శ్రీలలితా పరమేశ్వరి అయ్యప్ప ఆలయంలో భక్తుడు రవీందర్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశా రు. అర్చకులు నితీశ్, విజయ్ పూజలు నిర్వహించారు. అయ్యప్ప ఆలయంలో గురువారం ఆరట్టు మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న, గౌరవ అధ్యక్షుడు కొత్తపెల్లి సురేశ్ తెలిపారు. మాజీ జెడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.